# బంగారు పంజరం



ఆంధ్రభూమి, 6 ఫిబ్రవరి 1999

'కరుణ రాలేదా?' మత్తుతో కూరుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా విడదీసి చుట్టూ చూస్తూ నిరాశగా అడిగింది సుభద్ర.

భార్యనలా చూస్తుంటే రావుకి ప్రాణం కొట్టుకుపోయింది. చావు బతుకుల మధ్య ఊగిసలాడుతూ కూతురికోసం... అదీ ఒక్కగానొక్క కూతురికోసం కలవరిస్తోంది. కానీ కూతురిది వచ్చే పరిస్థితి కాదు. ఆమె డాక్టరు. క్షణం తీరిక లేనంత బిజీ.

"అది రాదే! రోజుకి పాతికవేల ఆదాయం వదులుకుని నీ దగ్గిరొచ్చి ఎందుకు కూర్చుంటుంది? అదో డబ్బు యంత్రం. దాన్నలా తయారుచేసింది సగం నువ్వూ, మిగిలిన సగం అతను. యంత్రాలకి నిర్దేశించబడిన పనులు చేయటమే తప్ప మమతలూ మమకారాలనే డీవియేషన్సుండవు. ఒక్క పిల్లతో సరిపెట్టుకుని, దాన్ని కూడా చూసుకునే తీరిక లేక హాస్టల్లో పడేసింది. అలాంటిది నీ కోసం వస్తుందనుకోవడం భ్రమ!"

ప్రశ్న అడిగి ఆ వెంటనే మత్తులోకి జారిపోయిన సుభద్రకి తన మాటలు వినిపించవని తెలిసినా ఉద్రేకాన్ని ఆపుకోలేక అనేసాడు రావు.

సుభద్రకి యుటిరస్ కేన్సర్. ఆ సంబంధంగా శరీరంలో వచ్చిన మార్పుల్ని మనోపాజ్‌కి సంబంధించినవనుకుని అశ్రద్ధచేసింది కాదని తెలుసుకునేసరికి కేన్సరు ముదిరిపోయింది. ఆమెకి టెస్టులూ, ఆపరేషన్ అన్నీ తనే దగ్గరుంచుకుని చేయించింది కరుణ. తగ్గదని తెలిసాక... స్వంతింట్లో కన్నుమూయ్యాలని వచ్చేసింది సుభద్ర.

కాలం కర్పూరంలా హరించుకుపోతోంది. ఆయువు నెలల్లోంచీ రోజుల్లోకి దిగిపోయింది. ఈవేళో రేపో తెలీదు. ట్రాంక్విలైజర్స్ మీద బతుకుతోంది. పగటికీ రాత్రికీ బేధంలేదు. ఆమెలో మిగిలి వున్న స్పందనంటూ ఒక్కటే. ఒక్కసారి... ఒకే ఒక్కసారి, కూతుర్ని చూసి కన్నుమూయ్యాలని...

రావు కళ్లల్లో నీరు తిరిగింది. ఎన్ని జ్ఞాపకాలని పంచుకున్నాడు ఈమెతో! ఎన్ని అనుభూతుల్ని పంచిచ్చింది! నవవధువుగా తన గుండెల్ని దోచుకుని, దాంపత్యపు మాధురిమల్లో ఓలలాడించి చివరిదాకా తోడుంటానని మాటిచ్చి తనకన్నా ముందే ప్రయాణమై తిరిగిరాని తీరాలకి వెళ్ళిపోతుంటే తను నిమిత్తమాత్రుడిలా వుండిపోవటం మినహా మరేమీ చేయలేని అశక్తత... దానికి తోడు ఆమె కోరిన అతి చిన్న, అత్యంత సహజమైన కోరికని తీర్చలేకపోవటం....

అంత బాధలోకూడా ఆలోచనలు అంతదాకా వచ్చి ఆగిపోయాక రావులో ఒక విధమైన విరక్తి... ఇందులో తనదేముంది? చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా... అని

ఏ విత్తునాటితే ఆ మొక్కే మొలుస్తుంది. డబ్బు విత్తనం మెదళ్ళో నాటితే మమకారాల మొక్కలు మొలుస్తాయా? కళ్ళముందు ఏవో జ్ఞాపకాలు...

★★★

'అమ్మా! నాకు లిప్‌స్టిక్ కొనివ్వవూ?' ఏడేళ్ళ కరుణ అడిగినప్పుడు సుభద్ర చాలా బాధపడింది, కూతురికి ఆపాటి చిన్న కోరిక కూడా తీర్చేశక్తి తనకి లేదని, భర్తకి ఇలాంటివన్నీ ఇష్టం వుండవు. అసలు కూతురు లిప్‌స్టిక్ అడిగిందంటే ముందు తననే కోప్పడతాడు, తాహతెరిగి పిల్లని పెంచటంలేదని చిన్న పిల్లలకి అవన్నీ ఏం తెలుస్తాయి? చుట్టూ వున్న ప్రపంచంలో ఎన్నో ప్రలోభాలు! రోజూ బడికొచ్చే తోటిపిల్లల్లో రకరకాల పోకడలు! వీటికతీతంగా వుండమని కరుణ నొక్కదాన్నీ ఎలా శాశించగలదు? అందులో ఎంత సంఘర్షణ వుంది! ప్రవాహంలో ఇమిడిపోయి పరుగుతియ్యాలిగానీ ఏటికెదురీది ఏం సాధించగలం?

ఇంటి ఖర్చుల్ని కుదించి కూతురు అడిగినవి కొనివ్వటం, ఆపైన భర్తకి సర్దిచెప్పటం అలవాటు చేసుకుంది సుభద్ర. తనకి ఇవన్నీ ఇష్టంలేకపోయినా భార్య ఇష్టాలని మన్నించే వ్యక్తి కావడంతో చూసి చూడనట్టు వదిలేసాడు రావు.

***

'అమ్మా! మనకి కారెందుకు లేదు? ఎప్పుడు కొంటావు?' ఇంటి ముందునించీ పోతున్న చాక్లెట్‌రంగు మారుతీకారుని ఆశగా చూస్తూ అడిగింది కరుణ. అప్పుడామెకి పదేళ్ళు.

'నువ్వు పెద్దయ్యాక పెద్ద డాక్టరువయ్యి కొనుక్కో' జవాబిచ్చింది సుభద్ర.

'డాక్టరైతే కారు కొనుక్కోవచ్చా?' ఆరాటంగా అడిగింది కరుణ.

'ఊ పెద్ద బంగళా, కారు... అన్నీ' వూరించింది సుభద్ర.

డాక్టరవడం... జబ్బు చేసిన అమ్మనో, నాన్ననో చూసిన స్ఫూర్తితో కాదు -

డాక్టరుకోర్సు చదవడం... సహజసిద్ధంగా ఉండాల్సిన ఆర్తితో కాదు - ఫస్టు రేంకొస్తోంది గాబట్టి అదో యాంబిషన్‌గా కూడా కాదు.

డబ్బు సంపాదించుకుని, బంగళాలూ, కార్లూ కొనుక్కోవడంకోసం. సరదాలు తీర్చుకోవడం కోసం...

అప్పుడు తీవ్రంగా స్పందించాడు రావు. భార్య ఆలోచనలు తప్పుదార్లో నడుస్తున్నాయని గ్రహించాడు. 'నువ్వు దాన్ని తప్పుదార్లోకి మళ్ళిస్తున్నావు. అది లిప్‌స్టిక్ అడిగిన రోజునే నువ్వు చెప్పాల్సింది - పెద్దయ్యాక సంపాదించుకుని కొనుక్కోమా! అని. అంటే నువ్వు సంపాదించుకుని తగలేసుకోమ్మా అని చెప్పడం... డబ్బు విలువెంతో దానికి తెలిసేది. కారడిగినప్పుడు మన తాహతేంటో చెప్పాల్సింది" అని మందలించాడు.

రావు చాలా సామాన్యమైన కుటుంబంలోంచీ వచ్చాడు. కష్టపడి చదువుకుని స్వశక్తితోనే ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని కలిగిన నిండైన మనిషని పరిచయమున్న ప్రతీవాళ్ళకీ తెలుసు. ఆడో మగో ఒక్క పిల్లయితే చాలని సరిపెట్టుకున్నాడు. ఆ ఒక్క పిల్లా వొడిదుడుకుల్లేని జీవితం గడపాలని ఆశపడ్డాడు. అంతకుమించి మరేదీ కోరుకోని సాదా మనిషి. అలాంటి వాడికి సుభద్ర ఆశలూ, కోరికలూ అంతుపట్టకుండా వున్నాయి. అందులో అపశృతి కూడా వినిపిస్తోందతనికి.

అతన్లాగే మామూలు కుటుంబంలోంచీ వచ్చింది సుభద్రకూడా. కరుణ ఒక్కర్తితోటీ సరిపెట్టుకున్నారుగాబట్టి ఆ ఒక్కర్తీ డాక్టరో ఇంజినీరో అయ్యి వుద్ధరించాలని ఆమె ఆకాంక్ష.

భార్యాభర్తలిద్దరి దృక్పథాలూ వేరు. దారులు వేరు. ఆశయాలు వేరు. ఆకాంక్షలు వేరు.

'మీదంతా చాదస్తంలెద్దురూ!' అనేసింది సుభద్ర తేలిగ్గా అప్పటికే కరుణ మెదళ్ళో డబ్బు విత్తనం పడనే పడింది. కష్టపడి చదివి డాక్టరైంది కరుణ. ఆపైన డీజీవో చేసింది. మేల్ డాక్టర్స్ కాంపటిషన్లో తట్టుకోవాలంటే ఎమ్మెస్, ఎమ్డీ కావాలికానీ లేడీ డాక్టర్స్‌కి డీజీవో అంత పెద్ద

క్వాలిఫికేషన్ మరొకటి లేదు.

చదువుకుంటున్నప్పుడే ఆనందమోహన్ పరిచయమయ్యాడు కరుణకి, అతను ఎం.డి. చేశాడు.

కరుణలో వున్న డబ్బు దాహం చూసే.... దాన్ని గుర్తించే.... ఆమె డాక్టర్‌గా బాగా షైనౌతుందని గ్రహించే ఆనందమోహన్ ఆమెని కట్నం లేకుండా చేసుకున్నాడు. ఇద్దరూ ఆరేళ్ళు ఫారిన్ వెళ్ళొచ్చారు. సిటీలో సెంటర్లో పెద్ద హాస్పిటల్ కట్టించుకున్నారు.

ఆనందమోహన్ చెల్లెలికి ఎనిమిది లక్షలిచ్చి పెళ్ళిచేసాడు. తమ్ముడ్ని డొనేషన్ కట్టి మెడిసిన్లో చేర్పించాడు. తండ్రికి బైపాస్ సర్జరీ చేయించాడు.

మూడు సిజేరియన్లూ ఆరు కన్సల్టేషన్లుగా కరుణ నర్సింగ్‌హోమ్ నడుస్తోంది. కాలు కింద పెట్టక్కర్లేకుండా కార్లు, రోజువారీ వాడకానికే రెండేసి వేల రూపాయల చీరలు... లగ్జరీ.... లగ్జరీ.... కూతురికి పట్టిన అదృష్టానికి సుభద్ర మురిసిపోయింది. రావు తొణకలేదు. ఆమెలా మురిసిపోలేదు. అతడికి అర్థమైంది. అల్లుడు తయారు చేసిన బంగారు పంజరంలో చిలక తన కూతురు. ఆమెకి కొనే చీరలూ, నగలూ ఒక హోదాని మెయింటెయిన్ చేసేందుకు, ధనవంతులూ, పరపతి గల పేషంట్ల దృష్టిలో ఆమె గొప్ప డాక్టర్ అనీ, తమది గొప్ప హాస్పిటల్ అనీ పేరు తెచ్చుకోవాలన్నదే అతడి ఆలోచన అనీ.

హాస్పిటల్... ఇల్లు, ఇంట్లోనూ క్లినిక్కు.... పూర్తిగా డబ్బు యంత్రమైంది కరుణ. ఆమె ప్రోగ్రామ్సన్నీ ఆనందమోహన్ ఫిక్స్ చేస్తాడు. కేసుల తాలూకు ఫీజులు కూడా అతనికే వెళ్ళిపోతాయి. ఎందులోనూ ఆమె ప్రమేయం లేదు.

తల్లికి సీరియస్‌గా వుందని తెలుసు. కానీ వెళ్ళే తీరిక తనకెక్కడిది? ఒక్కరోజు ఈ రొటీన్లోంచీ బైటపడగలిగితే తన పాపతో గడిపి ఉండేది.

★★★

అల్లుడికి ఫోన్ చేశాడు రావు.

'ఎలా వుంది ఆంటీకి?' రొటీన్ ప్రశ్నలు.

ఆ వెంటనే -

'మరేం ఫర్వాలేదు. ఇంకా టైముంది మీరేం టెన్షన్‌పడకండి." కేజువల్ వోదార్పు....

తన జవాబు వినకుండానే -

'అసలు మా దగ్గరే వుండుంటే బావుండేది' అంటూ కరుణని పంపించే ప్రస్తావనే లేకుండా ఫోన్ పెట్టేసాడు.

హతాశుడైపోయాడు రావు. అతనికో విషయం అర్థమైంది. తల్లిని చూడటానికి రావాలన్న కోరిక కరుణలోనే వుండాల్సినంత బలంగా లేదని, ఆమె ఆర్డరాఫ్ ప్రయారిటీస్‌లో అదెక్కడో చివరికి చేరుకుందని, మొదట్నుంచీ తెలిసిందే అయినా మరీ విస్పష్టంగా ... గుండెని గునపంతో పెకిలించినట్టు అనిపించి కళ్ళల్లోంచీ రక్తమంత చిక్కటి కన్నీరు కారింది.

★★★

రాత్రి పన్నెండింటికి రావుకి ఫోనొచ్చింది - కరుణ దగ్గర్నుంచీ.

'అమ్మకెలా వుంది నాన్నా? కనీసం ఫ్లైటు సర్వీసుంటే ఒకటి రెండుసార్లు వచ్చి చూసేదాన్ని.... రావటానికి ఎక్కడా వీలవటం లేదు. మూడు సిజేరియన్లు చేతిమీదున్నాయి. అవికాక నిన్న చేసిన ఆపరేషన్లు.... వూబిలో దిగబడుతున్నట్టుంది' ఆమె గొంతులో అస్పష్టమైన జీర. అది దుఃఖంవల్లనో, గిల్టీ కాన్షస్‌నెస్‌వల్లనో రావుకర్థం కాలేదు. అతను దాన్ని పట్టించుకోదల్చుకోలేదు.

వ్యక్తిత్వాన్ని డబ్బుకో, భర్తనే బంధానికో, పిల్లలనే మమకారానికో అమ్మేసుకునే ఆడవాళ్ళనతను క్షమించలేడు.

'ఫర్వాలేదమ్మా... నువ్వు రాలేకపోయినంత మాత్రాన ఇక్కడ పోయే ప్రాణం ఆగదు. ఏదేనా జరిగితే.. నువ్వు సింగపూర్‌నుంచీ మాకోసం తెచ్చిన వీసీ వుంది కదా. అందులో తీయించి, కేసెట్టు పంపిస్తాను. నీకు వీలు చిక్కితే చూద్దువుగాని' అనేసి ఫోన్ పెట్టేసాడు.

భార్య దగ్గరికొచ్చి కూర్చున్నాడు. ఆమె ఇంకా మత్తులోనే వుంది. తను కనిపెంచిన కూతురు తన కోసం వస్తుందన్న భ్రమలోనే ఉంది. పోయే క్షణం వస్తే ఏ భ్రమలూ ప్రాణాన్ని ఆపవు. ఆ క్షణం కోసం విరాగిలా ఎదురుచూడటమే!